క్లుప్తంగా

మెగా క్రికెట్ టోర్నీ విజేత గొనివారిపల్లి



ఎస్‌ఐ నుంచి ట్రోఫీని అందుకుంటున్న గొనివారిపల్లి జట్టు

ఓడీచెరువు: బుచ్చిరాజుపల్లి, మద్దకవారిపల్లిలో నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నీలో గొనివారిపల్లి జట్టు విజేతగా నిలిచింది. టోర్నీలో మొత్తం 30 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్‌మ్యాచ్‌లో బుచ్చిరాజుపల్లిపై గొనివారిపల్లి జట్టు గెలుపొందింది. విన్నర్స్‌కు ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి ట్రోఫీని అందజేశారు.

మార్కెట్ యార్డ్ డైరెక్టర్లుగా అచ్చమ్మ, నాగలక్ష్మి

తాడిమర్రి: ధర్మవరం మార్కెట్ యార్డ్ డైరెక్టర్లుగా శివంపల్లి గ్రామానికి చెందిన కేపీ రంగయ్య భార్య కే. అచ్చమ్మ, రామాపురానికి చెందిన తమ్మినేని రామ్మోహన్ భార్య నాగలక్ష్మిని ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా వారు తమ పార్టీ నేతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

గుండువారిపల్లిలో అమ్మవారి ఊరేగింపు

అమడగూరు: అమడగూరు చౌడేశ్వరీ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గుండువారిపల్లిలో గ్రామస్తులు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఘనంగా ఊరేగించారు. డప్పు, వాయిద్యాల నడుమ అమ్మవారి పల్లకీని ఎత్తుకున్న యువకులు చిందులు తొక్కుతూ ఉల్లాసంగా ప్రతి ఇంటి ముంగిటకు తీసుకెళ్లారు. కోర్కెలు తీరిన వారంతా అమ్మవారికి వడివేలును సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామ నడిబొడ్డున అమ్మవారిని కొలువుదీర్చి భక్తులకు ప్రసాదాన్ని పంచిపెట్టారు. ఊరేగింపు తర్వాత అమ్మవారిని బలకవారిపల్లికి తరలించారు.

పాడి ఆవుల మృతి



మృతి చెందిన ఆవులు

ముదిగుబ్బ: మండల కేంద్రంలో జల్లిపల్లి రాజు అనే పాడి రైతుకు చెందిన మూడు ఆవులు ఉన్నఫలంగా ఆదివారం మృతి చెందాయి. కడుపు ఉబ్బి ఒక్కసారిగా కింద పడి మృతి చెందినట్లు బాధిత రైతు తెలిపాడు. కాగా కలుషిత నీరు తాగడం వల్ల ఆవులు మృతి చెంది వుంటాయని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరారు.

కంటి వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: స్థానిక షిర్డీసాయిబాబా ఆలయంలో ఆదివారం కడప పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యులు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 70 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు షిర్డీసాయిబాబా సేవా సమితి అధ్యక్షుడు వీరనారాయణ, కార్యదర్శి రామలింగయ్య, ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి తెలిపారు.

పాలిసెట్‌కు ఉచిత కోచింగ్

కదిరి: స్థానిక కేఎల్ఎన్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు సోమవారం నుంచి పాలిసెట్, ఏపీఆర్‌జేసీ, ఆర్‌డీటీ, అగ్రీ పాలిసెట్‌తో పాటు బ్రిడ్జి కోర్సులకు అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీతో ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నారు. ఈమేరకు ఆ సంస్థ ప్రతినిధి ఎ.రమేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. వివరాలకు 93986 99192 లేదా 96764 35440 సెల్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నాటుసారా స్వాధీనం



నాటుసారాను స్వాధీనం చేసుకుంటున్న దృశ్యం

ముదిగుబ్బ: అనంతపురం ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆధ్వర్యంలో ఆదివారం గరుగుతండాలో నాటుసారా స్థావరాలపై దాడులను నిర్వహించారు. ఈసందర్భంగా 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకోవడంతోపాటు 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో నాటుసారా తయారు చేస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. పుట్టపర్తి ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందనాయక్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు నరసింహులు, శ్రీరాములు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సునంద, ఈఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, పుట్టపర్తి, ధర్మవరంఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, చంద్రమణి, ఎస్‌ఐ చాంద్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డు పూర్తయ్యేదెన్నడు?

- యార్డు నిర్మాణానికి రూ.6 కోట్లు విడుదల చేసిన గత ప్రభుత్వం
- పూర్తికాని ప్రహరీ, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం
- కొత్తచెరువులో అద్దె భవనంలో కార్యకలాపాలు
- రైతులకు తప్పని వ్యయప్రయాసలు



మార్కెట్ యార్డు స్థలంలో పెరిగిన పిచ్చి మొక్కలు

నల్లమాడ: నల్లమాడ మార్కెట్ యార్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. నల్లమాడ, ఓడీ చెరువు, అమడగూరు మండలాలు గతంలో తనకల్లు మార్కెట్ యార్డు పరిధిలో ఉండేవి. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలో వచ్చాక పుట్టపర్తి నియోజకవర్గ రైతులకు ప్రత్యేక మార్కెట్ యార్డు అవసరమని భావించి అప్పటి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చొరవతో ప్రభుత్వం నూతన మార్కెట్ యార్డును మంజూరు చేసి నిర్మాణానికి రూ.6 కోట్లు నిధులు సైతం మంజూరు చేసింది.

అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా భవనం



అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన మార్కెట్ యార్డు భవనం

రూ.కోట్లతో నూతనంగా నిర్మించిన మార్కెట్ యార్డు కార్యాలయ భవనం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. చదును చేసిన స్థలంలో తిరిగి పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి అటవీ ప్రాంతాన్ని తలపిస్తోంది. ప్రస్తుతం మార్కెట్ యార్డు కార్యకలాపాలు కొత్తచెరువులోని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. నల్లమాడ, ఓడీ చెరువు, అమడగూరు మండలాల్లో ప్రధానంగా రైతులు తమ ఉత్పత్తులను కొత్తచెరువులోని మార్కెట్ యార్డుకు తీసుకెళ్లి విక్రయించేందుకు సరైన రవాణా సౌకర్యాలు లేవు. ఫలితంగా కదిరి, మొలకలచెరువు తదితర దూర ప్రాంతాల మార్కెట్‌లకు దిగుబడులు తరలిస్తూ వ్యయప్రయాసలకు గురవుతున్నారు. మామిడి కాయలను హైదరాబాద్‌లోని మార్కెట్ తరలిస్తూ ధర లేమితో చాలాసార్లు రవాణా చార్జీలు కూడా గిట్టుబాటు కాక నష్టపోతున్నారు. నల్లమాడ మార్కెట్ యార్డు అందుబాటులోకి వస్తే పంట దిగుబడులను విక్రయించుకోవడానికి అనుకూలంగా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కార్యాలయ భవనంతోనే ఆగిన పనులు..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నల్లమాడ–పుట్టపర్తి ప్రధాన రహదారి పక్కన మండల కేంద్రానికి 3 కి.మీ దూరంలో అరవవాండ్లపల్లి తండా సమీపాన గట్లు వద్ద మార్కెట్ యార్డు నిర్మాణం కోసం స్థలం సేకరించి నిర్మాణ పనులు చేపట్టారు. భూమి చదును చేసి కార్యాలయ భవన సముదాయం నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ.3.5 కోట్లు ఖర్చు చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. తక్కిన రూ.2.5 కోట్లతో మార్కెట్ యార్డు ప్రహరీ, కొత్తచెరువులో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాల్సి ఉంది. వీటి నిర్మాణం కోసం ఇప్పటికే పలు దఫాలుగా టెండర్లు పిలిచినా పనులు చేయడానికి ఎవరూ ముందుకు రాలేదని సమాచారం. ఇంతలోనే ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారడంతో మార్కెట్ యార్డు నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. రైతులు పంట దిగుబడులు నిల్వ చేసుకునేందుకు శీతల గిడ్డంగులు నిర్మించాల్సి ఉంది. వీటికోసం ఇంకా ప్రతిపాదనలు కూడా పంపలేదని సమాచారం. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తొమ్మిది నెలలు పూర్తవుతున్నా మార్కెట్ యార్డు నిర్మాణంపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై నియోజకవర్గ రైతులుపెదవి విరుస్తున్నారు.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలవుతున్నా నల్లమాడ మార్కెట్ యార్డు అభివృద్ధి గురించి ఏమాత్రం పట్టించుకోలేదు. మార్కెట్ యార్డు అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. మార్కెట్ యార్డు కమిటీలు (నామినేటెడ్ పోస్టులు) భర్తీలో చూపుతున్న శ్రద్ధ ప్రభుత్వం అభివృద్ధిపై చూపడం లేదు.

–చంద్ర, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి, నల్లమాడ

అందుబాటులోకి తేవాలి



నల్లమాడ మార్కెట్ యార్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసి రైతులకు అందుబాటులోకి తేవాలి. ప్రస్తుతం పంట దిగుబడులును దూర ప్రాంతాల్లోని మార్కెట్‌లకు తరలించి విక్రయించుకోవాల్సి వస్తోంది. వ్యయప్రయాసలతో పాటు ధర లేమితో ఒక్కోసారి రవాణా చార్జీలు కూడా గిట్టుబాటు కావడం లేదు.

– వేణుగోపాల్‌రెడ్డి, యువరైతు, చెరువువాండ్లపల్లి, నల్లమాడ మండలం

చర్యలు తీసుకుంటాం

మార్కెట్ యార్డు నిర్మాణ పనులకు సంబంధించి వివరాలను ఉన్నతాధికారులను నివేదించి పనులు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. మూడు దఫాలుగా టెండర్లు పిలిచినా ప్రహరీ, షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. అలాగే శీతల గిడ్డంగుల నిర్మాణానికి కూడా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం.

–నరసింహమూర్తి, మార్కెటింగ్ శాఖ ఏడీ

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



పుట్టపర్తిలో జెండా ఎగురవేస్తున్న దృశ్యం

పుట్టపర్తి టౌన్/ తాడిమర్రి/: చెన్నేకొత్తపల్లి/ ఓడీచెరువు/ ఎన్పీకుంట: పుట్టపర్తి, తాడి మర్రి, చెన్నేకొత్తపల్లి, ఓడీచెరువు, ఎన్పీకుంట మండల కేంద్రాల్లో ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు పార్టీ ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేశారు. పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం మీదుగా బైక్ ర్యాలీ చేపట్టారు. సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

23న అవిశ్వాస తీర్మానం

కదిరి: కదిరి మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసాను పదవి నుంచి తప్పించేందుకు ఈ నెల 23న ఉదయం 11 గంటలకు అవిశ్వాస తీర్మాన సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ నుంచి కౌన్సిలర్లు నోటీసులు అందుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఇటీవల 26 మంది కౌన్సిల్ సభ్యులు సంతకాలు చేసిన ప్రతులను జిల్లా కలెక్టర్‌కు అందజేసిన విషయం తెలిసిందే. ఆ సంతకాలను పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్ అవిశ్వాస తీర్మాన సమావేశాన్ని నిర్ణయించారు.

పారిశుధ్య కార్మికులను ఆదుకోవాలి

ధర్మవరం: మున్సిపల్ కార్మికులకు ఆప్కాస్ రద్దును విరమించుకోవాలని ధర్మవరం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మిక సంఘం నాయకులు మంత్రి సత్యకుమార్‌కు విన్నవించారు. పట్టణంలోని క్రీడా మైదానంలో ఆదివారం ఆయనకు మున్సిపల్ పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు ఎం.బాబు, ముకుంద, లక్ష్మీ ఓబులేసు వినతిపత్రం అందజేశారు.

జూదరుల అరెస్టు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీనగర్ రైల్వే ట్రాక్ సమీపంలో ఆదివారం పేకాట ఆడుతున్న ఏడుగురు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.10,320 నగదును స్వాధీనం చేసుకున్నట్లు టూ టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు.

వైభవం.. రాములోరి కల్యాణం



గాండ్లపెంట మండలం కటారుపల్లిలో రాముల ఉత్సవ విగ్రహ ఊరేగింపులో పాల్గొన్న కదిరి ఆర్డీఓ దంపతులు



నల్లచెరువు మండలం పాలపాటిదిన్నె అంజన్న ఆలయంలో రాములోరి కల్యాణం



గొట్లూరులో ఉట్లమాను ఎక్కుతున్న యువకులు



పైలబోయలపల్లిలో సీతారాముల కల్యాణోత్సవం



ముదిగుబ్బలో కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



ఎన్పీకుంటలో ఉత్సవమూర్తుల ఊరేగింపు



కదిరిలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



పూజలు చేస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్

కదిరి టౌన్: శ్రీరామనవమి సందర్భంగా పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని రామాలయం, సైదాపురం ఆంజనేయస్వామి ఆలయం, మారుతీనగర్‌లో పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం, బేరిపల్లి కాలనీలో రామాలయంలో ఆదివారం రాములోరి కల్యాణం వైభవంగా సాగింది. బేరిపల్లి కాలనీలో సీతారాములకు వాల్మీకి పాఠశాల అధినేత జయరామిరెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు.

తాడిమర్రి: మండల కేంద్రంతోపాటు మద్దెలచెరువు, పత్రపల్లి, నిడిగల్లు, పుల్లంపల్లి ఆంజనేయ స్వామి ఆలయాల్లో కునుకుంట్ల, పిన్నదరి, నార్సింపల్లి, పెద్దకోట్ల, దాడితోట, ఆత్మకూరు, శివంపల్లి ఆలయాల్లో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బీసీ కాలనిలోని కోదండరామాలయంలో వేదు పండితులు మామిళ్ళపల్లి సంతోష్‌శర్మ సీతారాముల ల్యాణ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో అందంగా అలంకరించిన ఉత్సవ పల్లకిలో సీతారామలక్ష్మణుల విగ్రహాలను ఉంచి గ్రామంలో ఊరేగించారు.

అమడగూరు: మండల వ్యాప్తంగా ఆదివారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శీతిరెడ్డిపల్లి, కందుకూరిపల్లి, బాలప్పగారిపల్లి, మహమ్మదాబాద్, కొట్టువారిపల్లి, చీకిరేవులపల్లి గ్రామాల్లో రాముల చిత్రపటాన్ని ఊరేగించారు. పలుచోట్ల అన్నదానం ఏర్పాటు చేశారు.

బత్తలపల్లి: బత్తలపల్లి, లింగారెడ్డిపల్లి, పోట్లమర్రి, జలాలపురం, ముష్టూరు బీసీ కాలనీ, గుమ్మల్లకుంట, కాటమకుంట, నల్లబోయనపల్లి, సంఘమేశ్వరం, గంటాపురం, వేల్పుమడుగు గ్రామాల్లో ఆదివార శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. పలు గ్రామాల్లో సీతారాముల కల్యాణం జరిపించారు. పోట్లమర్రి గ్రామంలో జరిగిన పోటీల్లో సుమారు 30 మంది వాల్మీకుల యువకులు ఉట్ల మాను ఎక్కేందుకు పోటీ పడ్డారు. ఉదయ్‌భాస్కర్, రాజు, హరినాథ్, సాయికుమార్ ఉట్లమాను పైకి ఎక్కడంతో ప్రజలు వారిని అభినందించారు. ముష్టూరు బీసీ కాలనీలో రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు.

ఎన్పీకుంట: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని పెద్దబజారు, పెడబల్లి, పాపన్నగారిపల్లి, పి కొత్తపల్లి, గొకనపల్లి రామాలయాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేకం అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. రాత్రి మండల కేంద్రంలో సీతారాముల ఉత్సవమూర్తులను ఊరేగించారు.

ఆలయాల్లో పూజలు..

చెన్నేకొత్తపల్లి: మండల వ్యాప్తంగా శ్రీరామనవమి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చెన్నేకొత్తపల్లి, పైలబోయలపల్లి, ప్యాదిండి, న్యామద్దెల గ్రామాల్లో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కనగానపల్లి: శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఆదివారం మండలంలోని రామాలయాల్లో సీతారాముల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. మండల కేంద్రం కనగానపల్లితో పాటు మామిళ్లపల్లి, తగరకుంట, కొత్తూరు, శివపురం గ్రామాల్లో రాములోరి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. రామాలయాలను పచ్చని తోరణాలతో అలకరించి ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేశారు. మామిళ్లపల్లిలోని సీతారామాంజనేయస్వామి ఆలయం వద్ద అన్నదానం చేశారు.

నల్లచెరువు: శ్రీరామనవమి పురస్కరించుకొని మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో సీతా రాముల కళ్యాణాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో ఈఓ రవీంద్ర రాజు ఆధ్వర్యంలో వేద పండితులు సీతారాముల కల్యాణాన్ని జరిపించారు. భక్తులకు ఆలయ అధికారులు అన్నదానం నిర్వహించారు.

తనకల్లు: మండల కేంద్రంతో పాటు పెద్దపల్లి , కొక్కంటిక్రాస్‌లలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో శ్రీరామున్ని ఊరేగించారు. యువకుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ముదిగుబ్బ: స్థానిక పాతూరులోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం సీతారాములు కలాణోత్సవ కనుల పండువగా సాగింది. వేద పండితులు రంగాచార్యులు, చంద్రకిశోర్‌లు స్వామి వారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం నిర్వహించిన వేలంలో స్వామి వారి పట్టు పంచెను రూ.10 వేలకు కొండేటి దినేష్, అమ్మవారి పట్టుచీరను రూ.23 వేలకు బుజ్జమ్మ, కలశం చెంబును రూ. 6వేలకు చంద్రాయుడు దక్కించుకున్నారు.

ధర్మవరం అర్బన్: శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా దుర్గానగర్‌లో చిన్నారులు ఉట్టికొట్టారు. ఉట్లమాను కట్టి చిన్నారులు. లక్ష్మీచెన్నకేశవస్వామి శ్రీరాముని అలంకరణలో దర్శనమిచ్చారు. పట్టణంలోని రామ, ఆంజనేయస్వామి ఆలయాల్లో కల్యాణోత్సవాలు, అన్నదానం చేపట్టారు.రామ్‌నగర్, మారుతీనగర్‌లోని సీతారాముల కల్యాణ మండపంలో కల్యాణోత్సవం నిర్వహించారు. రాజేంద్రనగర్‌లోని కోదండరామస్వామి ఆలయంలో శ్రీ లలిత నాట్య కళానికేతన్ గురువులు బాబుబాలాజి, కమల బాలాజి, రామలాలిత్యల శిష్య బృందం భరతనాట్యం, కూచిపూడి, నృత్య రూపకం ప్రదర్శించారు. రామ్‌నగర్‌లోని కోదండ రామాలయం, గీతానగర్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయం, శివానగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో మంత్రి సత్యకుమార్ పూజలు చేపట్టారు.

గాండ్లపెంట: శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం గాండ్లపెంట, కటారుపల్లి,వేపలకుంట, కటకంవారిపల్లి, మలమీదపల్లి రామాలయాల్లో సీతారామ కల్యాణం నిర్వహించారు. కటారుపల్లిలో నిర్వహించిన సీతారాముల కళ్యాణానికి కదిరి ఆర్డీఓ ఎస్ఎస్ శర్మ, ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈఓ వి.శ్రీనివాస రెడ్డి హాజరయ్యారు.

మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట ఆధ్వర్యంలో..



పట్టు వస్త్రాలు మోసుకెళ్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, అపర్ణారెడ్డి దంపతులు

నల్లమాడ: మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి స్వగ్రామం నల్లసింగయ్యగారిపల్లిలోని రామాలయంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఆయన సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. శ్రీధర్‌రెడ్డి దంపతులు కుటుంబ సభ్యులతో కలసి పట్టువస్త్రాలను తలపై మోసుకెళ్లారు. కల్యాణోత్సవానికి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో భక్తులను అన్నదానం నిర్వహించారు.

రీ సర్వేలో భాగస్వాములు కండి

ప్రశాంతి నిలయం: రీ సర్వే కార్యక్రమంలో భూ యజమానులందరూ భాగస్వాములు కావాలని పుట్టపర్తి తహసీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి కోరారు. ఆదివారం రీ సర్వేపై విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వందేళ్ల క్రితం తయారు చేసిన రికార్డుల్లో జరిగిన మార్పులను సవరిస్తూ భూయజమానుల సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో భూములు రీసర్వే నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి రైతు రీ సర్వే కార్యక్రమంలో భాగస్వాములై తమ భూసర్వే రికార్డులను స్వచ్ఛీకరించుకోవాలని కోరారు. రీ సర్వే అనంతరం భూముల కొలతలలో తేడాలు ఉంటే వాటిని సరి చేయడంతోపాటు నూతన పాస్‌పుస్తకం ఉచితంగా అందిస్తామన్నారు. జాయింట్ ఎల్‌పీఎంలు లేకుండా రైతులు సహకరించాలని కోరారు.

హోరాహోరీగా ఎడ్లబండ్ల పోటీలు



ఎడ్లబండ్ల పోటీలు జరుగుతున్న దృశ్యం

గోరంట్ల: మండల పరిధిలోని కరావులపల్లి తండా సమీపంలో వెలసిన శివఅంజన్ ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఆలయ ధర్మకర్త సునీత శంకర్‌లాల్ నాయక్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఎడ్లబండ్ల పరుగు పోటీలు హోరాహోరీగా జరిగాయి. పోటీల్లో 61 మంది రైతులకు చెందిన ఎడ్లబండ్లు పాల్గొన్నాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు మంత్రి సవిత చేతుల మీదుగా నగదు బహుమతులను అందజేశారు. మండల పరిధిలో ఖాజాపురంకు చెందిన రైతు కుళ్లాయప్ప , బూచేపల్లికి చెందిన బూలేట్ సావకారి , పుట్టపర్తికి చెందిన వజ్రమణికి చెందిన వృషభాలు మొదటి, రెండో, మూడో స్థానాల్లో నిలిచాయి.



బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

సత్యమ్మకు బోనాలు

తలుపుల : మండలంలోని సిద్దుగూరిపల్లిలోని బోస్ ముత్తాత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామంలోని సత్యమ్మ దేవతకు బోనాల కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలతో తప్పెట వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.